క్లుప్తంగా

నూతన ఎంపీఓగా నందకిషోర్



నందకిషోర్‌ను శాలువా కప్పి సన్మానిస్తున్న ఎంపీడీఓ గ్యామా, తదితరులు

దోమ: నూతన మండల ఎంపీఓగా నందకిషోర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎంపీఓ సోమలింగం చౌడాపూర్ మండలానికి బదిలీ కావడంతో అప్పటి నుంచి దిర్సంపల్లి పంచాయతీ కార్యదర్శి పి రాజేశ్ ఇంచార్జి ఎంపీఓగా విధులు నిర్వహించారు. తాజాగా అధికారులు నూతన ఎంపీఓలను కేటాయించడంతో మేడ్చేల్ జిల్లాలోని కీసర మండలంలో విధులు నిర్వహించిన నందకిషోర్‌ను దోమకు కేటాయించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గ్యామా, పంచాయతీ కార్యదర్శులు నూతన ఎంపీఓను శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా అనునిత్యం కృషి చేస్తూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.

కోత్లాపూర్‌లో కూలిన ఇల్లు

ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడి మొర



కూలిన ఇల్లు

తాండూరు రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఎడతేరిపి లేకుండా వర్షం కురుస్తుంది. నైరుతిరుతుపవనాలు ముందుగా రావడంతో వర్షాలు పడుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. బుధవారం కురిసిన వర్షానికి కోత్లాపూర్ గ్రామంలో రావులపల్లి రవికి చెందిన ఇల్లు కూలిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు. గోనూర్ గ్రామ శివారులోని వరికొనుగోలు కేంద్రం వద్ద వడ్లు తడిసిపోయాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన సమయంలో డీసీఎంఎస్ అధికారులు వరి ధాన్యం కొనుగోలు చేయకపోవడంతోనే తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల నష్టపోతున్నామని రైతులు చెబుతున్నారు.

ఏజెంట్లను నియమించుకోవాలి



మాట్లాడుతున్న తహశీల్దార్

కొడంగల్: రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లను నియమించుకోవాలని తహశీల్దార్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అఖిల పక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలకు పార్టీలు సిద్ధం కావాలని సూచించారు. ఓటరు లిస్టును పరిశీలించి ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే సరి చేయించుకోవాలన్నారు. ప్రతి పార్టీ నుంచి బూత్‌లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. ఓటరు లిస్టులో మార్పులు చేర్పులు ఉంటే బూత్‌లెవల్ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. అఖిల పక్ష నాయకులు పట్టణ మాజీ సర్పంచు రమేష్‌బాబు, సీపీఐ నాయకుడు ఇందనూర్ బషీర్, ఆసీఫ్‌ఖాన్, బీజేపీ నాయకుడు కృష్ణయాదవ్, సీపీఎం నాయకుడు బుస్స చంద్రయ్య పాల్గొన్నారు.

సాయిరెడ్డి కుటుంబానికి పరామర్శ

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోటబాసుపల్లి గ్రామానికి చెందిన మాజీ డీసీసీబీ చైర్మన్ సిరిగిరిపేట్ సాయిరెడ్డి భార్య నర్సమ్మ రెండు రోజుల క్రితం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి కోటబాసుపల్లి గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప, నాయకులు అవినాష్‌రెడ్డి, రాందాస్, నర్సిములు, వీరేందర్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి..

బంట్వారం: కోట్‌పల్లి మండలంలోని జిన్నారం గ్రామానికి చెందిన సాయిల్‌గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ గీత సెల్ జిల్లా అధ్యక్షుడు ఈడ్గి వెంకటేశంగౌడ్ బుధవారం జిన్నారానికి వెళ్లి సంతాపం ప్రకటించి సానుభూతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

తప్పని విత్తన భారం

- గతంలో కంటే రెట్టింపునకు విక్రయం
- జీలుగ విత్తనాల ధర పెరుగుదలతో ఆందోళన
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



దౌల్తాబాద్‌లో జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ, తదితరులు

దౌల్తాబాద్: జీలుగ సాగుతో భూసారం పెరుగుతుంది. అందుకే రైతులు వీటిపై ఆసక్తి చూపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా జీలుగ విత్తనాలను రాయితీపై అందిచనుంది. ఈ ఏడాది యాభై శాతం రాయితీపై సహకార సంఘాల ద్వారా విక్రయించనున్నారు. గతంలో కంటే ధర రెట్టింపు పెరగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధిక ధర వెచ్చించి కొనుగోలు చేయాలంటే నగదు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కొందరు చెబుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి తక్కువ ధరకు విక్రయిస్తే కొంత మేర రైతులకు వెసులుబాటు కలుగుతుందని వేడుకుంటున్నారు. ప్రస్తుతం సంచి పరిమాణం 30కిలోలు ఉండగా గతంలో రాయితీపోను రూ.1,116కు అమ్మేవారు. ఒక్కో సంచికి రూ.2,232లు చెల్లించాల్సి ఉండేది. ఇప్పుడు సంచి ధర రూ.4,275 ఉండడంతో 50శాతం రాయితీపై రూ.2,137లకు అందుబాటులో ఉంచారు. గతంలో కంటే రూ.1,021ధర పెరిగిందని స్పష్టమవుతోంది.

విత్తన సేకరణ దృష్ట్యా..

జీలుగ విత్తనాల సేకరణలో ఇబ్బందులు కలుగనుండడంతో ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోందని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చెబుతుంది. జీలుగ విత్తనాలు గతంలో మాదిరిగానే తక్కువ ధరకు లభిస్తే అటు రైతులపై, ఇటు ప్రభుత్వంపై భారం ఉండేదికాదని అభిప్రాయం స్పష్టమవుతుంది. ప్రభుత్వం స్పందించి ధర పెంపు విషయాన్ని పునరాలోచన చేయాలని రైతులు, రైతు సంఘం నాయకులు కోరుతున్నారు,

ఆర్థిక భారం

జీలుగ విత్తనాలను ఎక్కువ ధరకు కొనుగోలు చేయడం వల్ల ప్రభుత్వానికి భారం ఏర్పడడమే కాకుండా రైతులకు ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురవుతున్నాయి. జీలుగ విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో వీటి సేకరణకు ఎక్కువ ఖర్చు చేయాల్సి వచ్చింది. ఫలితంగా ప్రభుత్వం ఎక్కువ ధరకు కొనుగోలు చేయడంతో ఆర్థిక భారం ఏర్పడింది. గతంలో మాదిరిగానే రాయితీ వర్తింపజేసినా ధర పెరగడం వల్ల రైతులపై అదనపు భారం తప్పలేదనే చెప్పొచ్చు.

తక్కువ ధరకు లభించేది



జీలుగ విత్తనాల ధర పెంచడం వల్ల రైతులపై తీవ్ర భారం ఏర్పడుతుంది. ప్రభుత్వం ఎక్కువ ధరకు కొనుగోలు చేసిందని రైతులపై భారం వేయడం తగదు. గతంలో తక్కువ ధరకు జీలుగ విత్తనాలు లభించేది.

– మధుసూదన్‌రెడ్డి, రైతు, గుండేపల్లి

రైతులను మోసం చేయడమే..



జీలుగ విత్తనాల ధర రెట్టింపు చేయడమంటే రైతులను మోసం చేయడమే. ఇప్పటికే వారు కష్టాలు చవి చూస్తున్నారు. మళ్లీ విత్తనాల ధర పెంచడం వల్ల ఆర్థిక భారం ఎక్కువై తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలి.

– కిషన్‌నాయక్, మామిడికుంట తండా

ఎమ్మెల్యేతోనే అభివృద్ధి సాధ్యం

మాజీ కౌన్సిలర్ బాంబిన



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న బాంబిన

తాండూరు టౌన్: తాండూరు అభివృద్ధి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డితోనే సాధ్యమని పట్టణ 14వ వార్డు మాజీ కౌన్సిలర్ బాంబిన పేర్కొన్నారు. బుధవారం ఆమె తన వార్డు పరిధిలో ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద మంజూరైన రూ.5లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అభివృద్ధి కేవలం జీఓలకే పరిమితమైందన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మనోహర్ రెడ్డి తాండూరు అభివృద్ధికి అత్యధిక నిధులు మంజూరు చేయించారన్నారు. ఏడాదిన్నర కాలంలోనే సీసీ రోడ్లు, డ్రైన్స్, వంటి అనేక అభివృద్ధి పనులు పూర్తి చేశారన్నారు. అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు సులేమాన్ ఖురేషి, ఖలీల్ ఖురేషి, వసీమ్, హఫీజ్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలను సాగు చేయాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వాసన్ సంస్థ సభ్యులు

దోమ: రైతులు అంతర పంటలతో పాటు చిరుధాన్యాలను సాగు చేసేలా శ్రద్ధ తీసుకోవాలని వాసన్ సంస్థ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం దోమ మండల పరిధిలోని ఐనాపూర్, పాలేపల్లి, బొంపల్లి గ్రామాలలో రైతులకు అంతర పంటలు, చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతీ రైతు పత్తి, మొక్కజొన్న కాకుండా అంతర పంటలను సాగు చేసేలా సహకరించాలన్నారు. చిక్కుడు, టమాట, బెండ, పాలకూర, ముల్లంగి, ఉల్లిగడ్డ, క్యారెట్ పంటలను నూతన వ్యవసాయ పద్ధతులతో సాగు చేసుకుంటే అధిక దిగుబడులు పొందొచ్చన్నారు.

రోడ్డును ఆక్రమిస్తే చర్యలు

తుర్కయంజాల్: రోడ్డును ఆక్రమించి, దుకాణాల ఎదుట బోర్డులు ఏర్పాటు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం పురపాలక సంఘం పరిధి బ్రాహ్మణపల్లి రోడ్డు, సాగర్ రహదారికి వరువైపులా దుకాణాల ఎదుట ఏర్పాటు చేసిన బోర్డులను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రోడ్డును ఆక్రమించి తోపుడు బండ్లు ఏర్పాటు చేయడం, నిర్మాణాలను చేపట్టడం ట్రాఫిక్ జామ్‌కు కారణం అవుతున్నారని, ఏడాది క్రితం ఇలాంటి వాటిపై కఠినంగా వ్యవహరించడంతో కొన్ని రోజుల పాటు ఇబ్బంది లేకుండా ఉందని వివరించారు. తిరిగి రోడ్లను ఆక్రమించడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఫిర్యాదులు అందాయని కమిషనర్ పేర్కొన్నారు. వ్యాపారులు సహకరించాలని కోరారు.

కాంగ్రెస్ పేదల ప్రభుత్వం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కొందుర్గు: చౌదరిగూలో ఇంటి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం పనిచేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం ఆయన జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని వాచ్యతండా, మల్కపహాడ్‌తండా, హేమ్లాతండా, లోక్యాతండా, రుకాలి తండా, చింతకుంటతండా, జిల్లేడ్ గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మల్కపహాడ్‌తండాకు చెందిన శివమ్మ ఇంట్లో భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాజు, కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

కొత్తూరు: కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో బుధవారం నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన ముదిరాజ్ కమ్యూనిటీ భవన ప్రారంభోత్సవం, సీసీరోడ్లు, ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా కాకుండా నిజమైన అర్హులకే ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తున్నట్లు స్పష్టం చేశారు. విడతల వారీగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో నాయకులు హరినాథ్‌రెడ్డి, ప్రభాకర్, రవికుమార్ గుప్తా, దేవేందర్‌ముదిరాజ్, శంకర్‌నాయక్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

నందిగామ: నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కొనసాగిస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని రంగాపూర్, చాకలిదానిగుట్టతండా, తాటిగడ్డతండాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం తాటిగడ్డతండాలో మురుగు కాల్వల నిర్మాణానికి, చాకలిదానిగుట్ట తండాలో సీసీరోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

నేడు మఠం భూముల కౌలు హక్కు వేలం

నవాబుపేట: తిమ్మారెడ్డిపల్లి గ్రామంలోని శ్రీ నంబిగురు స్వామి మఠం వ్యవసాయ భూముల సర్వే నంబరు 405 (12.29 ఎకరాలు), 406 (04.02), 407 (17.19), 491(26.04) మొత్తం (60.14 ఎకరాలను) మూడు సంవత్సరాలు వ్యవసాయం చేసు కోవడానికి కౌలుకు ఇవ్వనున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం 11.00 గంటలకు శ్రీ నంబి గురు స్వామి మఠం ప్రాంగణంలో కౌలు హక్కు వేలం పాట ఉంటుందని తెలిపారు. ఈ వేలంలో పాల్గొనేవారు రూ.5,000లు డిపాజిట్ చేసి పాల్గొనాలని తెలిపారు. ఆసక్తి గల వ్యవసాయ దారులు, రైతులు కౌలుహక్కు వేలంలో పాల్గొనాలని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

దుర్గామాత ఉత్సవాలు విజయవంతం చేయాలి

మర్పల్లి: శనివారం నుంచి జూన్ 2వ తేదీ వరకు గ్రామంలో దుర్గామాత ఉత్సవాలు చేపట్టనున్నట్లు ఉత్సహ కమిటీ సభ్యులు గ్రామస్తులు తెలిపారు. దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, నవగ్రహాల ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ పూర్ణాహుతి వంటి పలుకార్యక్రమాలు చేపడుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేసేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ

నవాబుపేట: మండలంలోని రైతులకు 50 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ విత్తనాలు అవసరం ఉన్న రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని వెళ్లి ఏఈఓలను సంప్రదించాలని పేర్కొన్నారు. ఏఈఓల వద్ద పర్మిట్లు జనరేట్ చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆగ్రోరైతు సేవాకేంద్రం, పీఏసీఎస్ కార్యాలయంలో విత్తనాలు తీసుకోవాలని తెలిపారు. జీలుగ విత్తనాలు క్వింటాల్‌కు రూ.14,250 ఉండగా 50% సబ్సిడీతో రూ.7,125లకు ఇస్తున్నట్లు వివరించారు.

జాబ్‌మేళాకు తరలిరండి

తాండూరు రూరల్: ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాకు తాండూరు మండలంలోని నిరుద్యోగులు పెద్ద ఎత్తున తరలిరావాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప పేర్కొన్నారు. బుధవారం కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగప్ప మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నారన్నారు. గురువారం పట్టణంలోని వినాయక కన్వెన్షన్ హాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారని చెప్పారు. ఆయా గ్రామాల్లోని కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు గ్రామాల్లోని నిరుద్యోగులను జాబ్ మేళాకు తరలించేందుకు కృషి చేయాలన్నారు. 50కిపైగ కంపెనీల్లో 10వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు.

బంట్వారంలో..

బంట్వారం: జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ కోట్‌పల్లి మండల యూత్ నాయకుడు ఇస్మాయిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పేదలను విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- కేఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్ కుమార్ రెడ్డి
- ఎంపీడీఓ గ్యామాకు వినతి పత్రం అందజేత



ఎంపీడీఓ గ్యామాకు వినతి పత్రం అందజేస్తున్న శరత్‌కుమార్‌రెడ్డి

దోమ: కాంగ్రెస్ ప్రభుత్వం అధికార పార్టీ నేతలకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తుందని, పేదలను విస్మరిస్తుందని కేఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్ కుమార్ రెడ్డి ఆరోపించారు. బుధవారం దోమ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల గందరగోళంపై ట్రస్ట్ సభ్యులతో కలిసి ఎంపీడీఓ గ్యామాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అధికారులు నలిగి పోతున్నారన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రతి పథకం కాంగ్రెస్ నేతల ద్వారానే ఇచ్చేలా రూపకల్పన చేయడం బాధాకరమన్నారు. దీంతో లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కాంగ్రెస్ నేతలు కేవలం వారి అనుబంధ నేతలకే మంజూరు చేయిస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

- లారీలు రాక ఇబ్బందులు పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



ఐనాపూర్‌లో వర్షానికి తడిసిన వడ్లతో ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

దోమ: ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం అకాల వర్షాలతో తడుస్తున్నాయి. దీంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. ఓ పక్క లారీల కొరత, మరో వైపు మూడు రోజులుగా కురుస్తున్న వానతో ఇబ్బందులు తప్పడం లేదు. కొనుగోలు కేంద్రానికి తీసుకొస్తే సకాలంలో కొనకపోవడంతో తడిసి ముద్దవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

లారీల కొరతతో..

దోమ మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామంలో కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన ధాన్యం అకాల వర్షానికి బుధవారం తడిసి మొలకెత్తాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరుపై మండిపడుతున్నారు. సకాలంలో లారీలు రాకపోవడంతోనే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయని అధికారులను నిలదీస్తున్నారు. ధర్నాలు చేపడుతున్నారు. మండలానికి మోత్కూర్ సమీపంలో ఒకే మిల్లు కేటాయించినప్పటికీ అతను సరిగ్గా మ్యాచర్ రావడం లేదని వడ్లు కొనుగోలు చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు రైతుల ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు వెంకటేశ్



బాధితులకు చెక్కులు అందజేస్తున్న గ్రామ నాయకులు

పరిగి: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు వెంకటేశ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని రాపోల్ గ్రామంలో పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేదల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. గ్రామంలోని పేదలకు సీఎం సహాయనిధి అందేలా కృషి చేశామన్నారు. అనారోగ్యానికి గురైన పేదలకు మెరుగైన చికిత్స కోసం ఈ నిధి ఉపయోగపడుతుందన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామంలో అభివృద్ధి పనులు చేపడతామని, దీనికి ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రవి, అన్వర్, బుగ్గయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



దోమ: దుకాణంలో పోలీసులతో కలిసి తనిఖీలు చేస్తున్న వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావు



కుల్కచర్ల: ఫర్టిలైజర్ దుకాణాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారి శంకర్ రాథోడ్

మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావు

దోమ: నకిలీ విత్తనాలు అమ్మితే విత్తన డీలర్లు, దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. బుధవారం దోమ మండల కేంద్రంలో పోలీసులతో కలిసి ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను అందించాలని తెలిపారు. కర్ణాటక రాష్ట్రానికి జిల్లా దగ్గరగా ఉండడంతో నకిలీ విత్తనాలు ఎక్కువగా సరఫరా అయ్యే అవకాశం ఉందని, అలాంటి విత్తనాలను అమ్మితే లైసెన్సులు రద్దు చేసి, పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు. విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని సూచించారు.

బిల్లులు లేకుండా విక్రయించొద్దు

కుల్కచర్ల: నఖిలీ విత్తనాలు అమ్మినా, బిల్లులు లేకుండా ఎరువులు, విత్తనాలు విక్రయించినా చర్యలు తీసుకుంటామని విత్తన జిల్లా తనిఖీ అధికారి శంకర్ రాథోడ్ పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలో పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దుకాణదారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించొద్దని, విత్తనాలను ఎంఆర్పీ ధరలకే విక్రయించాలని సూచించారు. లైసెన్సులు లేకుండా ఫర్టిలైజర్ దుకాణాలను నిర్వహించొద్దని అనుమతులు లేకుండా ఎరువులను, విత్తనాలను విక్రయిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వీరస్వామి, పాల్గొన్నారు.

బుక్‌కీపర్‌పై చర్యలు తీసుకోవాలి

రంగాపూర్‌లో మహిళల ఆందోళన



రంగాపూర్‌లో ఆందోళన చేస్తున్న మహిళా సంఘం సభ్యులు

పరిగి: మహిళా సంఘాల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న బుక్‌కీపర్‌పై చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని రంగాపూర్ గ్రామంలో మహిళా సంఘాల సభ్యులు ఆందోళనకు దిగారు. గ్రామంలో మహిళా సంఘాల పర్యవేక్షణకు విలేజ్ బుక్‌కీపర్‌ను నియమించారు. మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలను ఇప్పిస్తుంటారు. బ్యాంకు రుణాలు తీసుకున్న మహిళా సంఘాల నుంచి వేలల్లో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సంఘంలోని పది మంది మహిళలు ప్రతిఒక్కరూ కలిసి సంఘం తరుపున డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. కొంత మంది మహిళలు ప్రభుత్వం నుంచి మీకు జీతం వస్తుందని, ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. దీంతో బుక్‌కీపర్ మహిళలతో ఇష్టానుసారంగా మాట్లాడారని వాపోయారు. బ్యాంకులో రుణం తీసుకున్న ఒక్కో సంఘం నుంచి రూ. 10వేలకు పైగానే వసూలు చేస్తున్నారని వాపోయారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వం సహకారం అందిస్తుంటే గ్రామంలోని బుక్‌కీపర్ ఇష్టానుసారంగా వ్యవహరించడం బాధాకరమని చెబుతున్నారు. రుణాలు ఇప్పించి వేలల్లో డబ్బులు సంఘాల నుంచి దోచుకుంటున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఉన్నత అధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా విచారణ చేపట్టి ఉన్నత అధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు.